కథానిక

# మారని విలువలు

"పి. వి. పల్లి"

చుట్టూ ప్రాకారం. లోన పెద్దవాకిలి. వరండా మీద కుర్చీలు, సోఫాలు. సుమారు నలభై మందిదాకా కూచోవచ్చును. సుబ్బారావుగారు అల్లిక కుర్చీలో ఆసీనులై చుట్ట కాలుస్తున్నారు. ఎదురు కుర్చీలమీద వెంకటరావూ, అతని స్నేహితుడు రంగారావూ కూచున్నారు. ప్రక్కగా అభినవ 'రేలంగి'—వెంకటేశ్వర్రావు కూచున్నాడు.

"చూడండి వెంకటేశ్వర్రావుగారూ... మేం చేసేది ప్రజోపయోగ కార్యమే కాని, మా స్వంత పనికాదు. యీ సంవత్సరం సుమారు ఆరేడు వేలు నాటకాలద్వారానూ, మిగిలింది విరాళాలద్వారాను సేకరించాలి. అంచేత మీ ప్రోగ్రామే కాకుండా యింకా రెండుమూడు ప్రోగ్రాములు ఏర్పాటు చెయ్యాలి..."

"సరే-నేను కాదన్నానా...మీ సెలవు ప్రకారం నడుచుకుంటాననటినిగా-"...

"వీళ్లు కుర్రాళ్లు. కార్యరంగంలోకి దిగుతున్నారు. హైస్కూలుపని; సామాన్యంకాదు. పెద్దముండా వాళ్ళం మేం వుండికూడా కార్యరంగంలోకి దిగుతున్నా—ఆదాయం తెచ్చేపని నాది; పనివాళ్ళది."

"అలా అనాలి...అదీ రాజువంటి మాట." వెంకటరావు పొంగిపోయాడు.

సుబ్బారావుగారి పెదవులమీద మందహాసం తాండవించింది.

"సరే చెప్పవయ్యా. మొదటి ప్రోగ్రాం చూచి, బావుంటే తరవాతకూడా మిమ్మలినే పిలుస్తాం. యింకా చాలా పనుంది."

"ఖర్చులుతో ఐదువందల పదహార్లు ఇప్పించండి. 'చింతామణి' నాటకంకూడా కావాలంటున్నారు."

"అవునయ్యా! అది అయితేగాని యీ ప్రాంతం వాళ్ళకి రుచించదు."

"తమ అనుగ్రహం వుండాలికాని...సుబ్బిశెట్టి పాత్రకు నేనే తగుదును; నాగొప్ప నేను చెప్పుకో కూడదు."

"చింతామణి పాత్ర ఎవరిది?" అడిగారు సుబ్బారావుగారు.

"మా ఆవిడే నండి," సిగ్గుతో అన్నాడు.

"మిగిలిన పాత్రలు?"

"బిల్వమంగళుడు మా అన్నయ్య. శ్రీహరి మా తమ్ముడు. యిలా అందరూ మావాళ్ళే; అయినా అందరికీ వాళ్ళ రేట్లుప్రకారం యివ్వకపోతే ప్రయోజనంలేదు."

"అవును మరి...మీ నాటకం గురించి విన్నాను కూడా. చాలా బాగుంటుందని వినికిడి."

"తమరలా అంటారుగాని."

"సరే చెప్పవయ్యా."

"అంతేను బాబూ."

"అదంతా నాకు తెలీదు. ఖర్చులుకి వంద రూపాయిలూ, మీకు రెండువందల పదహార్లు యిచ్చేస్తాను..."

కుర్చీలోంచి లేచారు నాయుడుగారు.

"తమరలా అనకండి."

"మరేంలేదు. రెండో తారీఖు ఆదివారంనాడు నాటకం జరగాలి. ఇంకా పన్నెండు రోజులుంది."

"మనకి టైంచాలదు సార్. అడ్వర్టైజ్‌మెంటు బాగా చెయ్యాలి." అన్నాడు వెంకటరావు.

"ఆఁ చాల్లేవోయ్."

లోనికి వెళ్ళిపోయారు సుబ్బారావుగారు.

• • •

సోమసుందరరావు పంతులిని 'సోమేశం' అంటారా ఊళ్ళో. నాయుడుగారికి కుడిభుజం. -

"అయితే సోమేశం ..యీ వ్యవహారం చాలా కష్టమంటావ్."

'అవునండి. మీకే తెలుస్తుంది తరవాతతరవాత"

"ఏమైనా మన పేరుండిపోతుంది కదండీ. తరతరాలుగా మనలిని చెప్పుకుంటారు."

"సరే...మీ మాట కెప్పుడూ కాదనను. శ్రీరామచంద్రుడికి లక్ష్మణుడెప్పుడైనా ఎదురు తిరిగాడూ."

"నువ్వెప్పుడూ యిలాగే అంటావోయ్..." నవ్వుతూ అన్నారు.

"యేదో యీ నాటకం బాగుంటే తరవాత సంగతి ఆలోచిద్దాం."

"వెంకటరావు మహా చురుకైనవాడు కుర్రాడు. ముందు ముందు పనికొస్తాడు."

"ఆ...కుర్రకుంకలు - వాళ్ళెందుకుపయోగపడ తారు లెద్దురూ."

"అలా అనకు. వాడంటే ఊళ్ళో చాలమందికి గౌరవం వుంది. నాకు తెలుసు." సుబ్బారావు గారన్నారు.

"సోమేశం పంతులుకీ సుబ్బారావునాయుడికీ లేనిపలుకుబడి యింకొకరి కుంటుందని అనుకోకండి"

"అలా అనకు. కుర్రకారంతా వాడెంత చెబితే అంత."

"అని మీరనుకుంటున్నారు. చూస్తారూ నాయుడూ. ఒక్క వూపుతో వాడి పలుకుబడిని ఎగరకొట్టేస్తాను."

"అంత పనీ చేశావుగనక, యీ కార్యక్రమంలో వాడి చెయ్యివుంటేగాని వీలులేదు."

"నమస్కారమండీ నాయుడుగారూ."

గుమ్మంయెక్కాడు వెంకటరావు.

"అచ్చుపని పూర్తయిందా?"

"ఆc...పూర్తిఅయినట్లే" ప్రెస్‌వాడికి పాతిక రూపాయి లిచ్చాను. యింకా యిరవై రూపాయి లివ్వాలి."

"ఏమిటబ్బా అంత ఖర్చు!" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు సోమేశం.

"వాల్‌పోస్టర్లు — కరపత్రములు, టిక్కెట్లు వగైరా-" అతడు.

"అయినా అంతసొమ్మెందుకు?"మళ్ళీ ఆయనే.

"అవును మరి అవుతుంది."

"సొమ్ము యిప్పిస్తారా."అడిగాడు వెంకటరావు.

"చిల్లరకాగితాలు లేవు. తరవాతయిస్తాలే."

"అలాగే లెండి."

"ప్రచారం బాగుండాలి. కలక్షను యే మాత్రం వుంటుంది?"

"మూడువేలు దాటొచ్చును."

"అబ్బా—అంతవరకూ వుంటుందన్న మాట!"

"అదొక లెక్కా. ఆ పని నా కొదలండి-ఆరు వేలకీ కానీ తక్కువరానివ్వను-" సోమేశం.

"అందుకు మేం సిద్ధంగావున్నాం." వెంకటరావు.

"అహc...ఊరుకోవయ్యా; జరిగేపనిని చెడ గొట్టకు. వెంకటరావూ టిక్కెట్లు ఎలా పెట్టావ్?"

"పాతికా — పదిహేను — పది — అయిదు — మూడు—రెండు—ఒకటి. మొదటి రెండూ రెండు వరుసలు. పది, అయిదు, మూడేసి వరుసలు—మిగి లినవి చాలా వరుసలు."

"చాలా బాగుంది—సరే వెళ్ళండి. మీపని కానివ్వండి." వెంకటరావు వెళ్ళిపోయాడు. వెన కాల ఆరుగురు యువకులు.

* * *

"నాటకం రెండురోజులుంది. బుకింగ్ ప్రారం భించారా?" అడిగేడు సోమేశం పంతులు.

"ఏం పంతులూ ఎప్పుడు రావడం."

"యిదే...రైలుదిగి యింటిదగ్గర కాసిన్ని మంచినీళ్లుతాగి వస్తున్నా."

"ఆc...ఏం కలక్షను రెండువేలయింది. మిగి లింది ఆరోజే అవుతుందంటున్నాడు వెంకటరావు."

"అయితే యీ సొమ్ముతో ముందుగా ఏంపని సాగిస్తారు?"

"స్కూలుపని—అనగా పునాదులు త్రవ్వటం—ఫౌండేషను వెయ్యడం మొదలుగాగల పనులు."

"సరేగాని — నేనొకటి చెబుతాను — వింటారా. 'కుర్రబుద్ధీ కోతిబుద్ధీ ఒకటి' అన్నారు. సొమ్ము మాత్రం ఒక్క కానీ వాడిదగ్గర ఉంచనివ్వకండి. ఎందుకేనా మంచిది."

"అదీ నిజమే లెండి."

"యీ సాయంకాలమే ఆ డబ్బు తీసుకుంటే బాగుంటుంది."

"అలాగే..."

"అయితే ముహూర్తమెప్పుడు?—"

"వదో లేదీన—"

"వస్తాను. వెళ్ళి వాణ్ణి పంపుతా. ఆ సొమ్ము లాక్కోండి—"

"అలాగే—"

వెంకటరావు డబ్బుతో గుమ్మం యెక్కాడు.

"ఎందుకు రమ్మన్నారట. యీ సొమ్ము తెమ్మన్నారట?"

"అవునయ్యా కాలం మంచిదికాదు. దొంగ భయం జాస్తి, మాయింటి దగ్గరయితే జాగ్రత్తగా వుంటుందని."

"ఓ అలాగే వుంచండి. రెండువేల నాలుగు వందల అరవై."

"నాటకం యేర్పాట్లు బాగా జరుగుతున్నాయా?"

"బాగానే జరుగుతున్నాయి."

"గేట్లదగ్గిర మంచివాళ్ళ నుంచాలి సుమా—ఎవరినీ అనవసరంగా వదలవద్దు."

"అలాగేనండి"

"మరి వెళ్ళ—"

"నా చేతిఖర్చులు ఏభై దాటాయండి. అవి యిప్పించండి. ఆ సొమ్ము నాదికాదు. అప్పు చేశాను."

"ఆఖరిని చూచుకుందాం. నీ చేతిసొమ్ము పెట్టనిస్తానా?"

"వెళతాను—"

"ఆఁ..."

• • •

సోమేశంగారూ, నాయుడుగారూ అభినవ కేలంగిగారితో మాట్లాడుతున్నారు. వెంకటరావు ప్రభృతులు గేట్లువద్ద హడావుడిగా వున్నారు.

పాతిక రూపాయిల గేటువద్ద వెంకటరావు వున్నాడు. సుబ్బారావుగారు సకుటుంబంగా విచ్చేశారు. వెంకటరావు తప్పుకున్నాడు. ఎనమండుగురూ వరసగా కూచున్నారు.

రెండో గేటుద్వారా సోమేశంగారు, వారి కుటుంబీకులు ప్రవేశించి పదిసీట్లలో సర్దుకున్నారు.

సుబ్బారావుగారి బంధువులమనే పేరుతో మూడో గేటుద్వారా పదహారుగురు ప్రవేశించారు.

యీలా సుమారు రెండువందలమంది ప్రవేశించారు లోనికి.

టిక్కెట్లు కొన్నవాళ్ళకి జాగాలేకపోయింది. వెంకటరావు నడిగారు. వెంకటరావు విస్తుపోయాడు. హాలులో ఖాళీలేదు. వీళ్ళకి సీట్లు యివ్వాలి. ఎవరిని లెమ్మనడం?—

జరిగిన కథనంతా సుబ్బారావుగారికి విన్నవించాడు. సుబ్బారావుగారు "నాకు తెలీద"న్నారు.

అలా అంటారని వెంకటరావు అనుకోలేదు. సోమేశంగారితో చెప్పాడు.

మేనేజరుగారు తమరు. మాతో సెలవియ్యడ మెందుకు? మీరే యేర్పాట్లు చెయ్యండి.

ఫ్రీగా కూచున్న మిగతావాళ్ళని లెమ్మన్నాడు వెంకటరావు. వాళ్ళంగీకరించలేదు. టిక్కెట్లు కొన్నవారు దండించారు వెంకటరావుని.

గ్రీన్‌రూంలోంచి కబురొచ్చింది వెంకటరావుకి డబ్బు చెల్లిస్తేగాని వాళ్ళ 'కోటూ' వెయ్యమన్నారట తన చేతిలో డబ్బులేదు. అంతా నాయుడిగారి చేతికి చిక్కింది.

వెళ్ళి అడిగాడు నాయుడిగారిని.

"ఏం సొమ్ము?" అడిగారు.

"నాటకంవాళ్ళ కివ్వవలసింది."

యిక్కడికి నేను తెచ్చానటయ్యా." కాస్త భీకరంగా.

"మరెలాగండీ-అంత సొమ్మూ మీకే యిచ్చేను కదా-"

"ఏమో ఎవడికి తెలుసు-కొంత నువ్వు వుంచుకోకుండా వుంటావా? యివ్వవయ్యా—"

"అలా అనడం న్యాయంకాదు." యింకొక యువకుడు.

ఇంతట్లో సోమేశంగారొచ్చి "ఏమిట"న్నారు.

"నన్ను డబ్బు యిమ్మంటున్నాడు-"నాయుడుగారు ఫర్యాదు చేశారు.

"అవును మరి. ఆనాడే నేను చెప్పాను. ఆ డబ్బంతా తీసుకోమని-"

"నాదే పొరపాటు. ఆ డబ్బు నా దగ్గిర వుంచుకోవలసింది. పోనీకదా యేంచేస్తాడు. వాడే దాస్తాడు అని ఉపేక్ష చేసి వూరుకున్నందుకిదా శాస్తి. నాకు నువ్వు ఒక్కకాని అయినా యిచ్చావయ్యా? కలక్షనంతా మీ యింటి దగ్గర దాచుకొని నన్నెందుకడుగుతావ్?" వెంకటరావుకి బుర్ర తిరిగిపోయింది. ఇప్పుడిప్పుడు డబ్బు వుందని ఒప్పుకున్న మనిషి యింతలోనే లేదనడమా?—

ప్రేక్షకులు గోల ఎక్కువయింది. జాగా చూపించకపోతే రిఫండు యిమ్మంటున్నారు ప్రేక్షకులు.

(తరువాయి 40వ పేజీలో)